పోలీస్ శాఖలో బదిలీలలు

నియామకమైన కొద్దిరోజుల్లోనే ట్రాన్స్‌ఫర్లు

- పైరవీలతో ఇన్‌స్పెక్టర్ల పోస్టింగులు.. ఆతర్వాత స్థానచలనం
- ఎస్సైల నుంచి ఏసీపీల వరకు గందరగోళంగా ప్రక్రియ

సుబేదారి, మార్చి 9: పోలీసు శాఖలో ఎస్సైలు, ఇన్‌స్పెక్టర్లు, ఏసీపీల బదిలీల ప్రక్రియ గందరగోళంగా మారింది. పోస్టింగ్‌లు పొందిన కొద్ది రోజులకే బదిలీ అవుతున్నారు. పైరవీలతో లక్షలాది రూపాయలు పెట్టి పోస్టింగ్ పొంది, బాధ్యతలు చేపట్టిన కొందరు ఇన్‌స్పెక్టర్లపై కొద్ది రోజులకే వేటు పడడంతో తలలు పట్టుకుంటున్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎస్సైల నుంచి ఏసీపీల వరకు సాధారణ బదిలీలు కాగా ఈ పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే పోలీస్ అధికారుల బదిలీలు జరిగాయి. అందులో భాగంగా గత నెల 7, 10 తేదీల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధి సెంట్రల్, ఈస్ట్, వెస్ట్ జోన్లలో భారీగా ఇన్‌స్పెక్టర్ల బదిలీలు జరిగాయి. మొదటి విడుతలో 28మంది బదిలీ కాగా, చాలా మంది వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో దీర్ఘకాలంగా పనిచేస్తున్నవారే ఉన్నారు. అందులో చాలా మంది పైరవీలతో లక్షలాది రూపాయలు పెట్టి అధికార పార్టీ నేతల సిఫారసుతో పోస్టింగ్‌లు పొందినట్లు ప్రచారంలో ఉంది. రెండో విడుతలో తొమ్మిది మంది బదిలీ అయ్యారు. ఇవన్నీ అధికార పార్టీ నేతల సిఫారసులతోనే జరిగినట్లు తెలిసింది. వరంగల్ సెంట్రల్ జోన్, ఈస్ట్ జోన్ పరిధిలోని నలుగురు ఇన్‌స్పెక్టర్ల బదిలీల విషయంలో ప్రభుత్వంలో కీలకనేత సిఫారసు చేయగా, అదే జోన్ల పరిధిలోని ఇద్దరు ఎమ్మెల్యేలు అభ్యంతరం తెలిపినట్లు సమాచారం. తమ నియోజకవర్గంలో మీ పెత్తనం ఏందని అభ్యంతరం తెలిపి, తమకు అనుకూలంగా ఉన్నవారికే పోస్టింగ్‌లు ఇప్పించుకున్నట్లు ప్రచారం. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఇద్దరు ఎమ్మెల్యేలు, అధికార పార్టీ నేతలు తమ నియోజకవర్గాల ఇన్‌స్పెక్టర్ల పోస్టింగ్‌ల విషయంలో అనుచరులతో భారీగా డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వరంగల్ సెంట్రల్ జోన్ పరిధిలో కొత్తగా పోస్టింగ్ పొందిన ఓ ఇన్‌స్పెక్టర్ రూ.25లక్షలు, నగర శివారులో పోస్టింగ్ పొందిన ఇన్‌స్పెక్టర్ రూ.20లక్షలు ముట్టజెప్పి పోస్టింగ్ తెచ్చుకున్నట్లు తెలిసింది. వరంగల్ నగరంలో ఏడాదిన్నరగా పనిచేస్తున్న ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు తమను బదిలీ చేయొద్దని అధికార పార్టీ నేతను పలుమార్లు కలిసి రెక్వెస్ట్ చేసుకున్నారు. సడన్‌గా తన నియోజకవర్గంలో కొత్తవారు పోస్టింగ్‌లు ఇప్పించుకోవడంతో ఈ ముగ్గురు తలలు పట్టుకున్నారు. ఇక మరో ఇద్దరు ఇన్‌స్పెక్టర్ల బదిలీల విషయంలో మొదటి విడుత బదిలీల్లో కేయూసీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన అబ్బయ్య పరకాలకు బదిలీ కాగా, ఖమ్మం నుంచి వచ్చిన శ్రీధర్‌కు కేయూసీ పోస్టింగ్ ఇచ్చారు. మూడు రోజుల వ్యవధిలోనే ఈ ఇద్దరి నియామకాలకు రాజకీయ కోణంలో బ్రేక్ పడింది. ఇక వరంగల్ సెంట్రల్ జోన్ పరిధిలో ముగ్గురు ఇన్‌స్పెక్టర్ల బదిలీల విషయంలో అధికార నేతల మధ్య వివాదం జరిగినట్లు తెలిసింది. ఈపంచాయతీ ఇన్‌చార్జి మినిస్టర్ దృష్టికెళ్లగా, చివరికి ఎమ్మెల్యేల ఆమోదంతోనే పోలీస్ ఉన్నతాధికారులు ఇన్‌స్పెక్టర్ల బదిలీ ఉత్తర్వులను జారీ చేశారు. వెస్ట్ జోన్‌లో రూ.15 లక్షలు పెట్టి పోస్టింగ్ తెచ్చుకున్న ఓ ఇన్‌స్పెక్టర్ కొద్ది రోజులకే బదిలీ కావడంతో షాక్ తిన్నాడు. అతడు ఎస్సై నుంచి ఇక్కడే ప్రాధాన్య పోస్టింగ్ చేస్తున్నాడు.

ఏసీపీల బదిలీల్లోనూ..

ఏసీపీల బదిలీల వ్యవహారం కూడా అనేక మలుపులు తిరిగాయి. ఇద్దరు రెండు రోజుల వ్యవధిలోనే మళ్లీ లా అండ్ ఆర్డర్ ప్రాధాన్య పోస్టింగ్‌లను దక్కించుకోవడం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో చర్చకు దారితీసింది. ఫిబ్రవరి 12వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం 110 మంది డీఎస్పీలను బదిలీ చేసింది. వీరిలో వర్ధన్నపేట ఏసీపీ డి.రఘుచందర్ జగిత్యాలకు, వర్ధన్నపేటకు సికింద్రాబాద్ నుంచి నర్సయ్య, మామునూర్ నుంచి సి.సతీష్‌బాబు డీజీపీ ఆఫీస్, ఇక్కడికి కొత్తగూడెం నుంచి అబ్దుల్ రెహమాన్ నియామకమయ్యారు. కే దేవేందర్‌రెడ్డి జనగామ నుంచి హనుమకొండ, జనగామకు దామోదర్‌రెడ్డి నియామకమయ్యారు. పీ తిరుమల్ నర్సంపేట నుంచి వరంగల్ ట్రాఫిక్, ఎం భోజరాజు వరంగల్ ట్రాఫిక్ నుంచి రామగుండం సీసీఎస్, పీ డేవిడ్‌రాజ్ కాజీపేట నుంచి కరీంనగర్ పీటీసీ, వి.కిరణ్‌కుమార్ హనుమకొండ నుంచి నర్సంపేటకు బదిలీ అయ్యారు. రెండు రోజుల వ్యవధిలోనే తిరుమల్ వరంగల్ ట్రాఫిక్ నుంచి కాజీపేట బదిలీ కాగా, మామునూర్‌కు సతీష్‌బాబు తిరిగి అక్కడే పోస్టింగ్ పొందారు. మళ్లీ ఈనెల 2న మామునూరు నుంచి సతీష్‌బాబు డీజీపీ ఆఫీస్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇంటెలిజెన్స్ నుంచి బి.తిరుపతి వచ్చారు. వరంగల్ ట్రాఫిక్‌కు తొలుత నర్సంపేటలో పనిచేసిన తిరుమల్ బదిలీకాగా, రెండు రోజుల్లోనే కాజీపేట ఏసీపీగా నియామకమయ్యారు. ట్రాఫిక్‌కు డీజీపీ ఆఫీస్ నుంచి టి.సత్యనారాయణ పోస్టింగ్ పొందారు. ఏసీపీల బదిలీల్లోనూ అధికార పార్టీ ఎమ్మెల్యేల సిఫారసుతోనే జరిగినట్లు తెలుస్తోంది. వీరిలో నలుగురు ఏసీపీలు వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలోనే దీర్ఘకాలంగా పనిచేస్తున్నారు. పైరవీలతో పోస్టింగ్‌లు తెచ్చుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ బదిలీలతో నిజాయితీ, ప్రతిభ ఉన్న ఇన్‌స్పెక్టర్లు, ఏసీపీలకు పోస్టింగ్‌లు దక్కలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో పైరవీలకే ప్రాధాన్యం ఉందని కొందరు నిజాయతీ పోలీస్ అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సైల విషయంలో కొద్ది రోజుల క్రితం వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో పది మంది బదిలీ అయ్యారు. రెండు రోజుల్లో తిరిగి పాత స్థానానికే వచ్చారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కొందరు ఇన్‌స్పెక్టర్లు, ఏసీపీలకు బదిలీ తప్పలేదు. వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో స్థానికతగా పనిచేస్తున్న వారంతా బదిలీ అయ్యారు. ముఖ్యంగా అధికార నేతల అండదండలతో పోస్టింగ్ పొందిన కొందరు ఇన్‌స్పెక్టర్లు వారిలో ఉన్నారు.

నేడు 'కే-హబ్' ప్రారంభోత్సవం

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

హనుమకొండ చౌరస్తా, మార్చి 9 : కేయూలో నిర్మించిన కే-హబ్ బిల్డింగ్ సహా పలు అభివృద్ధి పనులను ఆదివారం ప్రారంభించనున్నట్లు రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వీటిలో సమ్మక్క బాలికల వసతి గృహం, భారతరత్న పీవీ నరసింహారావు విజ్ఞాన కేంద్ర బిల్డింగ్, పరిపాలన భవన్ రెండవ అంతస్తు, విశ్వవిద్యాలయం చుట్టూ ప్రహరీగోడ, సారలమ్మ బాలికల వసతి గృహం, పగిడ్డిరాజు బాలుర వసతిగృహానికి శంకుస్థాపనలు చేయనున్నట్లు పేర్కొన్నారు. వీసీ తాటికొండ రమేశ్ అధ్యక్షతన ఉదయం జరిగే ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ, సీతక్క, పొన్నం ప్రభాకర్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, అలుగుబెల్లి నర్సిరెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి హాజరు కానున్నారని పేర్కొన్నారు.

వాగు పారక సాగు సాగక..

పంటలు ఎండి.. గుండెలు పగిలి..

- నీళ్లు లేక ఆకేరు వాగు వెలవెల.. ఎండుతున్న వరి
- ఎక్స్‌కవేటర్‌తో వాగులో గుంతలు.. గంటకు రూ.3వేలు ఖర్చు
- పంటను కాపాండేందుకు భగీరథ ప్రయత్నం
- తొమ్మిదేళ్లలో ఇంత కరువు చూడలేదంటున్న రైతులు

కౌసల్యదేవిపల్లి వాగులో నీటి కోసం ఎక్స్‌కవేటర్‌తో గుంత తీస్తున్న రైతులు

నర్సింహులపేట, మార్చి 9 : కళ్ల ముందే ఎండుతున్న పంటలను చూసి అన్నదాతల గుండెలు పగులుతున్నాయి. వాటికి ప్రాణం పోసి బతికించుకునేందుకు నానాతంటాలు పడుతున్నారు. సాగునీళ్ల కోసం భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. నర్సింహులపేట మండలంలోని పలు గ్రామాల శివార్ల నుంచి పారే ఆకేరు వాగు ఈ సారి ఎండిపోయింది. చుక్క నీరు లేక వెలవెలబోతున్నది. వాగు ఆసరాగా చేసుకొని వేసిన యాసంగి వరి పంటలు నీళ్లు లేక ఎండిపోతుండగా, వాటిని కాపాడుకునేందుకు అరిగోస పడుతున్నారు. కౌసల్యదేవిపల్లి శివారులో వాగుపై నిర్మించిన చెక్‌డ్యాం పూర్తిగా ఎండిపోవడంతో వరి చివరి దశలో ఉన్న వరికి నీళ్లు అందించడానికి రైతులు ఇబ్బందిపడుతున్నారు. భవిష్యత్‌లో నీళ్లు వచ్చే పరిస్థితి లేకపోవడంతో వాగులో గంటకు రూ.3వేలు ఖర్చు చేసి ఎక్స్‌కవేటర్ సాయంతో గుంతలు తవ్విస్తున్నారు. తొమ్మిదేళ్ల కాలంలో ఇంతటి కరువు పరిస్థితిని చూడలేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చేతికొస్తున్న వరి పంట కాపాడేందుకు ఆకేరు వాగులోకి ఎస్సారెస్పీ జలాలను వదలాలని కోరుతున్నారు.

నీటి కోసం అరిగోస పడుతున్నాం

నాలుగు నెలల నుంచి వాగులో నీరు లేక చేతికొచ్చిన పంటలను కాపాడేందుకు అరిగోస పడుతున్నాం. నలుగురం కలిసి తలా కొంత వేసుకుని వాగులో గుంత తీయిస్తున్నాం. వాగులో ఉన్న తుమ్మ చెట్టు కింద నీడకు కూర్చొని ఒక వాటకు గంట చొప్పున ముగ్గురం వరికి నీళ్లు పారిస్తున్నం. 10రోజుల వరకైనా వాగులోకి నీరొస్తే పంట బతుకుతుంది. లేకపోతే కష్టమే.

– ఎర్పుల శ్రీరాం, రైతు, కౌసల్యదేవిపల్లి

కూలికి పోయిన పైసలతో గుంత తీయిస్తున్నా..

ఎకరంపావు పొలంలో నీరు పారించేందుకు చాలా ఇబ్బంది పడుతున్నా. వాగులో గుంత తీసేందుకు మిరపకాయలు ఏరబోయిన కూలి పైసలు తెచ్చి ఇచ్చిన. తొమ్మిదేళ్లలో ఎప్పుడూ వాగు ఎండిపోలే. వరి పంట కోసం ఇప్పటికే రూ.25వేలు ఖర్చు చేసిన. తీరా పొట్ట దశకు వచ్చే సరికి నీళ్లు అందక ఎండిపోతున్నది. పొత్తు మోటర్ కావడంతో అందరం తలా రూ.9వేలు వేసుకుని జేసీబీతో గుంత తీయించినం. వాగులోకి నీళ్లు వచ్చే విధంగా చూడాలె. లేకుంటే మా పంటలు ఎండిపోతాయి.

– ఎర్పుల బీబమ్మ, కౌసల్యదేవిపల్లి

ఎస్సీకాలనీకి నీళ్లొచ్చాయి..

- 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన
- యుద్ధప్రాతిపదికన పైప్‌లైన్‌కు మరమ్మతులు
- తీరిన సీతారాంపురం వాసుల కష్టాలు

గణపురం, మార్చి 9 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం సీతారాంపురం ఎస్సీకాలనీవాసుల నీటి సమస్యకు పరిష్కారం లభించింది. శుక్రవారం 'నమస్తే తెలంగాణ'లో 'గుక్కెడు నీళ్లందించండి' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆ కాలనీవాసులకు తాగునీరందడం లేదనే విషయం పత్రిక ద్వారా వెలుగులోకి రావడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారి నారాయణరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లేశం, డీఈలు మధు, పరమేశ్వరి చర్యలు తీసుకున్నారు. శనివారం ఉదయం నుంచి రాత్రి 7గంటల వరకు సీతారాంపురంలోనే ఉండి నీటి పైపులైన్ మరమ్మతులు పూర్తి చేసి కాలనీకి నీరందించారు. అలాగే గ్రామంలోని నీటి ట్యాంక్‌కు సైతం నీటిని సరఫరా చేశారు. ఈ సందర్భంగా సీతారాంపురం గ్రామస్తులు 'నమస్తే తెలంగాణ'కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు ప్రశాంత్, రంజిత్, కార్యదర్శి దివ్య, ఎంపీటీసీ మంద అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

సాంస్కృతిక వారసత్వంలో ఓరుగల్లు దిట్ట

- కళాకారుల అభ్యున్నతికి కృషి చేస్తా
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- సహృదయ తెలుగు భాషా ఆహ్వాన నాటక పోటీలు ప్రారంభం

పోచమ్మమైదాన్, మార్చి 9: సాంస్కృతిక వారసత్వం కలిగిన ఓరుగల్లు కళలకు కాణాచిగా వెలుగొందుతున్నదని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో తెలుగు భాషా ఆహ్వాన నాటక పోటీలను శనివారం రాత్రి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సంస్థ అధ్యక్షుడు గన్నమరాజు గిరిజా మనోహరబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కళలకు నిలయమైన వరంగల్ ప్రత్యేకతను కాపాడుతూ కళాకారుల అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. అలాగే, కళాక్షేత్రాన్ని సర్వహంగులతో త్వరలోనే అందుబాటులోకి తెస్తామన్నారు. పారితోషిక దాతలు మల్లెల రవీంద్రశర్మ, పాలాయి శరత్, సంతోష్ ప్రసంగించగా, సాంస్కృతిక కార్యదర్శి వనం లక్ష్మీకాంతారావు కళా నివేదికను సమర్పించారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే నాయిని

అలరించిన ప్రదర్శనలు

మిత్రా క్రియేషన్స్ హైదరాబాద్ ఆధ్వర్యంలో 'లక్ష్మణరేఖ దాటితే' నాటికను ప్రదర్శించారు. ఎస్ఎం భాషా దర్శకత్వంలో సాగిన నాటిక అద్భుతంగా ప్రదర్శించారు. ఆనాడు సీత లక్ష్మణరేఖ దాటి ఒక తప్పు చేస్తే.. దాని పర్యవసానం పెద్ద సాహసాలు, పెద్ద యుద్ధాలు, రాక్షస సంహారం జరిగిన తీరును కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. మానవ సంబంధాలన్నీ పెడదారి పట్టడానికి, ఆదర్శంగా ఉండాల్సిన కుటుంబ వ్యవస్థ కుంటుపడటానికి నేడు స్మార్ట్‌ఫోన్లే మూల కారణమవుతున్నట్లు పేర్కొన్నారు. ప్రమాదకరమైన ఆన్‌లైన్ గేమ్‌లతో నేటి సమాజం ఎటుపోతున్నదో తెలియని అయోమయాన్ని సృష్టిస్తూ సమకాలీన వ్యవస్థకు ప్రతిబింబిస్తుంది.

కౌసల్యా సుప్రజా రామా నాటికలో ఓ సన్నివేశం

ఆకట్టుకున్న 'కౌసల్యా సుప్రజా రామా'

ప్రముఖ సినీ, బుల్లితెర నటుడు గోపరాజు విజయ్ దర్శకత్వంలో శ్రీసాయి ఆర్ట్స్ కులకలూరివారి ఆధ్వర్యంలో కౌసల్యా సుప్రజా రామా నాటికను ప్రదర్శించారు. మానవ విలువలకు ప్రాధాన్యం ఇస్తూ నాటిక ఆద్యంతం అందరినీ అలరించింది. ఇందులో సురభి ప్రభావతి అద్భుత నటన ప్రేక్షకులను ఆకట్టుకున్నది. కార్యక్రమంలో సహృదయ బాధ్యులు కుందావఝుల కృష్ణమూర్తి, ఎం.రాధాకృష్ణ, డాక్టర్ ఎన్‌వీ ఎన్ చారి, పందిళ్ల అశోక్‌కుమార్, లక్ష్మణ్ రావు, సీతా వెంకటేశ్వర్లు, జూలూరి నాగరాజుతోపాటు స్థానిక కళాకారులు, సాహితీవేత్తలు, కవులు పాల్గొన్నారు. కాగా, ఈ నాటిక ప్రదర్శనలు 12వ తేదీ వరకు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మున్సిపాలిటీలు అధ్వానం

- నర్సంపేట, వర్ధన్నపేటల్లో పారిశుధ్య లోపం
- డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు
- నెలలుగా నిలుస్తున్న మురుగునీరు
- దుర్వాసన.. దోమలు పెరిగి జ్వరాలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

నర్సంపేట/వర్ధన్నపేట, మార్చి 9: మున్సిపాలిటీల్లో పారిశుధ్యం లోపించింది. నర్సంపేట, వర్ధన్నపేట పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణ సరిగా లేక అధ్వానంగా మారింది. రోడ్లు, వీధులు, డ్రెయినేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతో దోమలు విపరీతంగా పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నర్సంపేట మున్సిపాలిటీ పరిధి 24 వార్డుల్లో చెత్త పేరుకుపోయింది. ఇళ్ల నుంచి తడి, పొడి చెత్త సేకరించి తీసుకెళ్లాల్సిన ట్రాక్టర్లు వారానికోసారి వస్తున్నాయి. డ్రెయినేజీల్లో మట్టి, చెత్త పేరుకుపోయింది. దీంతో మురుగు నీరు నిలిచి దుర్వాసన వస్తోంది. ఈక్రమంలో దోమలు పెరిగి ప్రజలకు నిద్రలేకుండా చేస్తున్నాయి. ప్రజలు పలుమార్లు ఫిర్యాదులు చేస్తున్నా, నివారణకు మందు పిచికారీ చేయడం లేదు. చెత్త తొలగించాలని కోరుతున్నా పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వస్తున్నాయి. మురుగునీరు కాల్వల నుంచి అంబేద్కర్ సెంటర్, నెక్కొండ రోడ్డు, పాకాల సెంటర్‌లో రోడ్ల మీద ప్రవహిస్తోంది. ఇళ్ల మధ్య రోడ్లపై చెత్త కుప్పలను రోజుల తరబడి తొలగించకపోవడంతో ఫిర్యాదు చేసినా అశ్రద్ధ వహిస్తున్నారు. దోమలు కుట్టి జ్వరాల బారిన పడి ఆస్పత్రులకు వెళ్తున్న వారి సంఖ్య పెరుతోంది. పన్నుల వసూళ్లలో శ్రద్ధ చూపే అధికారులు సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తుండడంపై ప్రజలు ఆగ్రహిస్తున్నారు.



వర్ధన్నపేట: ఇంటిముందు మురుగుకాలువలో చెత్తను తొలగించుకుంటున్న మహిళ

వర్ధన్నపేటలో..

వర్ధన్నపేట పట్టణంలోని వార్డుల్లో నెలలుగా డ్రెయినేజీలను శుభ్రం చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న వర్ధన్నపేట కేసీఆర్ పాలనలో మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయ్యింది. రూ.35 కోట్ల నిధులను కూడా మంజూరు చేయగా పట్టణంలోని ప్రధాన రహదారులు, వార్డుల్లోని రోడ్ల ఇరువైపులా డ్రెయినేజీలను నిర్మించి పారిశుధ్య సమస్యను పరిష్కరించారు. కానీ ప్రస్తుతం అధికారులు, పాలక మండలి పారిశుధ్య నిర్వహణపై పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. వారికి ఎన్నిసార్లు చెప్పినా ఫలితం ఉండడంలేదని స్థానికులు వాపోతున్నారు. 10వ వార్డుతోపాటు పలు వార్డుల్లో డ్రెయినేజీలను పారిశుధ్య కార్మికులు శుభ్రం చేయడంలేదు. దీంతో మురుగునీరు నెలల తరబడి నిలుస్తోంది. వ్యర్థాలు కూడా పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. కౌన్సిలర్లు రాజకీయాలు చేస్తూ కాలం వెళ్లబుచ్చుతున్నారే తప్ప ప్రజా సమస్యలను పట్టించుకోవడంలేదని స్థానికులు ఆగ్రహిస్తున్నారు. కానీ ప్రస్తుత పాలకులు, అధికారులు పారిశుధ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం తమకు శాపంగా మారిందని ప్రజలు అంటున్నారు. ఈ క్రమంలో ఎవరి ఇళ్ల ముందు కాల్వల్లో పేరుకుపోయిన చెత్తను వారే తొలగించుకుంటున్నారు. అధికారులు, పాలకులు సాకులు చెబుతున్నారని మండిపడుతున్నారు.

నర్సంపేట: నర్సంపేట 13వ వార్డులో పేరుకుపోయిన చెత్త

గుమ్మడిదొడ్డికి ఏమైంది..?

- వైరల్ ఫీవర్, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న గ్రామస్తులు
- రక్త నమూనాలు సేకరించినా నిర్ధారణ కాని వ్యాధి
- 12 రోజులైనా గ్రామం వైపు కన్నెత్తి చూడని డీఎంహెచ్‌వో ?
- రోజురోజుకూ పెరుగుతున్న బాధితుల సంఖ్య

వాజేడు, మార్చి 9 : వాజేడు మండలంలోని గుమ్మడిదొడ్డి గ్రామస్తులు తెలియని వ్యాధితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మోకాళ్లు, కీళ్ల నొప్పులు, వైరల్ ఫీవర్‌తో మంచం పట్టారు. 12 రోజుల క్రితం ముగ్గురితో మొదలైన బాధితుల సంఖ్య ప్రస్తుతం 70కి చేరింది. స్థానిక వైద్యాధికారులు గ్రామానికి వచ్చి వైద్యం అందించినా పరిస్థితిలో మార్పు రాలేదు. ఇప్పటికే రక్త నమూనాలు సేకరించి జిల్లా కేంద్రంలోని టీ హబ్‌కు పంపగా ఇప్పటివరకు ఎలాంటి వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ కాకపోవడంతో ఏం జరుగుతున్నదో తెలియక గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కలెక్టర్ ఇలా త్రిపాఠి సైతం మెరుగైన వైద్యసేవలందించాలని వైద్యాధికారులను ఆదేశించడంతో పాటు ప్రతి ఒక్కరూ భౌతికదూరం పాటిస్తూ మాస్కులు ధరించాలని సూచించారు. ఇంత జరుగుతున్నా జిల్లా వైద్యాధికారి మాత్రం గ్రామం వైపు కన్నెత్తి చూడడం లేదు. ప్రజలు ఏ వ్యాధితో బాధపడుతున్నారు? తీసుకోవాల్సిన చర్యలు ఏమిటి? మెరుగైన వైద్యం కోసం ఎక్కడికైనా తరలించాలా ? ఇక్కడే ఉంచి వైద్యం అందించాలా అనే దానిపై వైద్యాధికారులతో రివ్యూ చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.

బాధితుల నుంచి రక్తనామునాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

ఇంటింటా సర్వే

తాజాగా కలెక్టర్ ఆదేశాల మేరకు డిప్యూటీ డీఎంహెచ్‌వో విపిన్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం వాజేడు వైద్యాధికారుల బృందం గ్రామంలో ఇంటింటా సర్వే నిర్వహించింది. బాధితులను గుర్తించి రక్త నమూనాలను జిల్లాకేంద్రానికి పంపినట్లు తెలిపారు. అలాగే పీహెచ్‌సీని సందర్శించి రిజిస్టర్లను పరిశీలించారు. ఇప్పటివరకు సేకరించిన రక్త నమూనాలపై ఆరా తీయడంతో పాటు అందిస్తున్న వైద్యచికిత్స గురించి అడిగి తెలుసుకొని సిబ్బందికి పలు సూచనలు చేశారు. గతంలో వైద్య పరీక్షలు చేసి ల్యాబ్‌కు పంపినా ఎలాంటి వ్యాధులు ఉన్నట్లు నిర్ధారణ కాలేదని, వైరల్ ఫీవర్‌గా భావిస్తున్నట్లు ఆయన వివరించారు. శనివారం గ్రామంలో 10మందికి హైదరాబాద్ నుంచి తెప్పించిన డబ్ల్యూహెచ్‌వో(వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్) ద్వారా తీసిన రక్త నమూనాల ఆధారంగా వచ్చే రిజల్ట్స్‌తో ఎలాంటి వ్యాధి ఉందో నిర్ధారణ అవుతుందో తెలుస్తుందన్నారు. ఇక్కడ వైద్యాధికారులు కొమురం మహేందర్, రహేల్, అభినవ్, హెల్త్ సూపర్‌వైజర్ కోటిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.